ఆంధ్రజ్యోతి
andhrajyothy.com ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.8, కనిష్ఠం 19.2

ఆదిలాబాద్
జిల్లా వార్తలు

సోమవారం 11 మార్చి 2024



● కాల్చిన బుట్టలు అమ్ముతున్న మహిళ

● ఉట్నూర్ ఏజెన్సీలో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న

మొక్కజొన్న సాగు.. భలే బాగు!

- ఉమ్మడి జిల్లాలో యాసంగి సీజన్ కింద జోరుగా సాగవుతున్న మొక్కజొన్న
- లాభదాయకంగా ఉందంటున్న రైతులు
- ఎకరానికి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి
- రూ.20 వేల పెట్టుబడితో.. పంట కాలానికి రూ.50వేల వరకు లాభం
- సామాన్య ప్రజలకు సైతం ఉపాధి
- పశువులకు చొప్ప(ఎండుగడ్డి)గా లభ్యమవుతున్న పశుగ్రాసం
- కోళ్ల పరిశ్రమకు దాణా రూపంలో ఎంతగానో ఉపయుక్తం
- పంటలో తెగుళ్ల నివారణకు వ్యవసాయాధికారుల సస్యరక్షణ చర్యలు
- జిల్లావ్యాప్తంగా దాదాపు వెయ్యి ఎకరాలలో సాగవుతున్న మొక్కజొన్న

ఉట్నూర్, మార్చి 10: ఉమ్మడి జిల్లాలోని రైతులు యాసంగి పంటల కింద మొక్కజొన్న పంటను పెద్ద మొత్తంలో సాగు చేస్తున్నారు. మొక్కజొన్న దిగుబడి లాభదాయకంగా ఉందని భావిస్తున్న రైతులు మొక్కజొన్నను విరివిగా సాగు చేస్తున్నారు. గతంలో కేవలం వర్షధారంగా వానాకాలంలోనే ఖరీఫ్ సీజన్ కింద మొక్కజొన్న సాగు చేసే రైతులు.. ప్రస్తుతం మూడు కాలాల్లో కూడా పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా దాదాపు వెయ్యి ఎకరాలలో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఉట్నూర్ మండలంలోని పెరికగూడ, నాగపూర్, ఏందా, ఏంకా, ఉమ్రి, పులిమడుగు, దంతన్‌పల్లి, ఉడుంపూర్, కడెం, దస్తూరాబాద్‌లలో జోరుగా సాగు చేస్తున్నారు. అంతేకాకుండా ఇంద్రవెల్లి, నార్నూర్, ఆదిలాబాద్, బోథ్, ఇచ్చోడతో పాటు ఆయా మండలాల్లోని రైతులు మొక్కజొన్నను విరివిగా సాగు చేస్తున్నారు. సాగునీటి వనరులు ఉన్న రైతులందరూ మొక్కజొన్నతో పాటు గోధుమ, శనగలు కూడా అంతంత మాత్రమే సాగు చేస్తున్నారు. మొక్కజొన్న సాగు వల్ల లాభాలు రావడంతో పాటు వ్యాపారులు పంట ప్రదేశానికి చేరుకుని పంటను కొనుగోలు చేస్తుండడంతో రవాణా భారంతో పాటు శ్రమ కూడా తగ్గుతుందని భావిస్తున్నారు. దీంతో రైతులు మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెంచారు. ఎకరానికి రూ.20 వేలు పెట్టుబడి పెడితే పంట కాలానికి రూ.50వేల వరకు వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరానికి ఎనిమిది క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. ఒక ఉట్నూర్ మండలంలోనే సుమారు పదివేల ఎకరాల వరకు రైతులు మొక్కజొన్నను సాగు చేస్తున్నట్లు తెలుస్తుంది.

సామాన్య ప్రజలకు ఉపాధి

మొక్కజొన్న పంట రైతులకు లాభాలు తెచ్చి పెట్టడమే కాకుండా.. సామాన్య పేద ప్రజలకు కూడా ఉపాధి కల్పిస్తోంది. జిల్లాలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, ఆదిలాబాద్, గుడిహత్నూర్, ఇచ్చోడ, నేరడిగొండ, ఇందన్‌పల్లి, జన్నారం, దండేపల్లి, కెరమెరి, జైనూర్, ఉడుంపూర్, కడెం, తదితర ప్రాంతాలలో సామాన్య పేద ప్రజలు రోడ్లకు ఇరువైపున బస్టాండ్‌లలో, కూడళ్లలో, ప్రజలు అధికంగా తిరిగే ప్రదేశాలలో మక్కబుట్టలను బొగ్గులపై కాల్చి విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. కాల్చినమక్క బుట్టలు ఆరోగ్యానికి బాగుంటాయని భావిస్తున్న ప్రజలు ఆరోగ్యంపై దృష్టి సారించి జోరుగా మక్కబుట్టలను కొనుగోలు చేయడం గమనార్హం. గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు, పురుషులు మొక్కజొన్న సాగు చేస్తున్న రైతుల పంటచేలకు వెళ్లి మక్క కంకులను మూడు నుంచి ఐదు రూపాయాలకు కొనుగోలు చేస్తున్నారు. అక్కడి తీసుకువచ్చి బొగ్గులపై కాల్చిన మక్కబుట్టలను విక్రయిస్తుంటారు. అయితే ఒక్కో మక్క బుట్ట పది రూపాయలకు విక్రయించడం ద్వారా సగటున రోజుకు 500 నుంచి వెయ్యి రూపాయల వరకు ఉపాధి పొందుతున్నారు.

పశుగ్రాసంగా మొక్కజొన్న కాడలు

మొక్కజొన్న పంట సాగు చేస్తున్న రైతులకు మక్కబుట్టలు అమ్ముకోగా.. పంటచేనులో మిగిలిన మొక్కజొన్న కాడలు (పశుగ్రాసం)గా ఎంతగానో ఉపయోగపడుతాయి. మొక్కజొన్న సాగు చేసే రైతులకు పాడి పశువులు ఉంటే వాటికి మేతగా ఉపయోగించుకోవడంతో పాటు పశుగ్రాసంగా కూడా విక్రయిస్తూ రైతులు లాభాలు పొందుతున్నారు. మంచిర్యాల, లక్షెటిపేట, కరీంనగర్, తదితర ప్రాంతాలలో ఎక్కువగా మొక్కజొన్న సాగు లేకపోవడం వల్ల ఆ ప్రాంతంలోని పాడి పశువుల యజమానులు పశుగ్రాసం కోసం జిల్లా వైపు ఉన్న పల్లెలకు చేరుకుంటారు. వేసవి కాలంలో పశుగ్రాసం కొరత రాగానే లారీల వంటి వాహనాల ద్వారా మొక్కజొన్న, జొన్న పంటకు సంబంధించిన చొప్ప (పశుగ్రాసం)ను కొనుగోలు చేసుకుని తీసుకుని వెళ్తుంటారు.

కోళ్ల పరిశ్రమకు దాణా

ఉమ్మడిజిల్లాలోని గ్రామీణ ప్రాంతాల రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటతో కోళ్ల పరిశ్రమకు కూడా దాణాగా ఉపయోగపడుతుంది. ఈ ప్రాంతంలో రైతులు పండించిన మొక్కజొన్న పంటను మార్కెట్లో విక్రయించడం ద్వారా రైతులకు లాభం వస్తుండగా, వ్యాపారులు ఈ ప్రాంతం నుంచి సిద్దిపేట, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, రంగారెడ్డి, తదితర ప్రాంతాల్లో ఉన్న కోళ్ల పరిశ్రమలకు దాణాగా చేరవేస్తున్నారు. రైతులతో పాటు వ్యాపారులకు కూడా మొక్కజొన్న పంట సాగు వల్ల ఎంతగానో లాభాలు వస్తున్నాయంటున్నారు.

మొక్కజొన్నలో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలివీ..

మొదటి మూడు వారాల వయస్సు గల మొక్కజొన్న చేలలో మెటరైజియంను 5గ్రా.లను లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. ఎకరానికి 8 లింగాకర్షక బుట్టలను అమర్చుకోవడం వల్ల కత్తెర పురుగు ఉధృతిని గమనించవచ్చు. వేపనూనె 5మి.లీ.లను 1లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవడం వల్ల కత్తెర పురుగు గుడ్లు, మొదటి దశ లార్వాలను నాశనం చేయవచ్చు. రెండవ దశ, మూడవ దశలో ఉన్న లార్వాలను అరికట్టడం కోసం స్పైనటోరం 0.5మి.లీ. లేదా ఏమమేక్టిన్ బెంజోయేట్ 0.4గ్రా. లేదా క్లోరంట్రా నీలిప్రోల్ 0.4మి.లీ.లలో ఏదో ఒక మందును లీటర్ నీటికి కలిపి స్ప్రే చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. నాల్గవ దశ, ఐదవ దశలో నివారించడానికి విషపు ఎరను వాడాలి. విషపు ఎర తయారీకి 2కిలోల బెల్లంని 2లీటర్ల నీటిలో కలిపి దీనికి 10కిలోల తౌడుని కలిపి ఈ మిశ్రమాన్ని 24గంటలు పులియనిచ్చి వాడడానికి అరగంట ముందు 100 గ్రాముల తయోడికర్బ్ అనే మందు కలిపి చిన్న ఉండలుగా చేసుకుని మొక్కసుడులులలో వేసుకోవాలని, ఈ మిశ్రమం ఒక ఎకరానికి సరిపోతుందని పేర్కొంటున్నారు.

గ్రామీణ ప్రాంతాలలో సాగునీటి వనరులను పెరగాలి
: కొమ్ము రాంచందర్, రైతు, ఉట్నూర్



గ్రామీణ ప్రాంతాలలో రైతులకు అందుబాటులో మరిన్ని సాగునీటి వనరులను ప్రభుత్వం పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నాగపూర్ ప్రాంతంలో రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన నాగపూర్ ప్రాజెక్టు ద్వారా మూడు పంటలు కూడా రైతులు పండిస్తున్నారు. చెరువులు, కుంటలు, వ్యవసాయ బావులు అందుబాటులోకి తెచ్చి రైతుల అవసరాలను తీర్చాలి.

కంకులు కాల్చి అమ్మితే కైకిలి పడుతుంది
: రామక్క, దినసరి కూలీ, ఉట్నూర్



ప్రతీరోజు మక్కబుట్టలు కాల్చి అమ్మడం ద్వారా కైకిలి(కూలి) పడుతుంది. రోజుకు రూ.500 పొద్దంతా కష్టపడి కాల్చి అమ్మడం ద్వారా సంపాదిస్తున్నాను. కాల్చిన మక్కబుట్టలు తినడానికి ప్రజలు ఎంతగానో ఇష్టపడుతారు.

మొక్కజొన్న రైతులకు అవగాహన కల్పిస్తున్నాం
: రాథోడ్ గణేష్, వ్యవసాయాధికారి, ఉట్నూర్



మొక్కజొన్న పంట సాగు చేస్తున్న రైతులకు మొదటి నుంచి అవగాహన కల్పిస్తున్నాం. క్లస్టర్ల వారీగా ఉన్న ఏఈవోల ద్వారా రైతు వేదికలలో సమావేశం నిర్వహించాలి. ఇందులో పంటలకు కావాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించడం జరుగుతుంది. దీంతో రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ విస్తరణ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు.

సంక్షిప్త సమాచారం



పట్టణంలోని మారెమ్మ ఆలయం

మారెమ్మ ఆలయంలో చోరీ

● రూ.40 వేలు, అర తులం బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లిన దొంగలు

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 10: పట్టణంలోని శివాజీచౌక్‌లో గల మారెమ్మ ఆలయంలో దొంగతనం జరిగింది. శనివారం రాత్రి మారెమ్మ ఆలయంలో గుర్తు తెలియని దొంగలు గేట్లు పగలగొట్టి లోనికి వచ్చి హుండీలోని దాదాపు రూ.40 వేలు, అర తులం బంగారం, 10 తులాల అమ్మవారి వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం ఆలయ కమిటీ అధ్యక్షుడు బాదన్‌గంగన్న ఆలయానికి వచ్చి చూడగా దొంగతనం జరిగినట్లు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు బాదన్ గంగన్న మాట్లాడుతూ ఆలయ హుండీలోని 40నుంచి రూ.50వేల వరకు నగదుతో పాటు బంగారు, వెండి ఆభరణాలు దొంగలించినట్లు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల సంబురాలు

ఉట్నూర్, మార్చి 10: రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించడం పట్ల మండలకేంద్రంలోని ఆర్టీసీ ఉద్యోగులు స్వీట్లు పంచుకొని సంబరాలు నిర్వహించుకున్నారు. ఆదివారం ఉదయం డిపోకు చేరిన ఉద్యోగుల ఆధ్వర్యంలో స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు రవాణా మంత్రి పొన్నం 2017 పీఆర్సీ 21 శాతం ప్రకటించడంతో పాటు 2013 పీఆర్సీ బకాయిలు ఈనెల 11న చెల్లిస్తామని ప్రకటించారని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రిష్ణ, పోశెట్టి, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం

బోథ్, మార్చి 10: మండలంలోని దేవర నాయక్ తండా గ్రామ పంచాయితీ పరిధిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ మూడు లక్షల రూపాయలతో మంజూరైన సీసీ రోడ్డు పనులను ఎంపీటీసీ సునీత ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు ఎమ్మెల్యే అనిల్‌తో పాటు ఎంపీపీ తుల శ్రీనివాసులు మంజూరు చేయించారన్నారు. ఇందులో జాదవ్ బాబులాల్, రాథోడ్, మోతిలాల్, పాడెదరాసి జాదవ్, కృష్ణ రాథోడ్, ప్రశాంత్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి, మార్చి 10: ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం-జన్‌మన్) కార్యక్రమం కింద ఆదివారం మండలంలోని పాటగూడ, గట్టేపల్లి గ్రామాల్లో రూ.60 లక్షలతో కొలం కమ్యూనిటీ మల్టీపర్పస్ భవనాలు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల ఆదివాసీ గ్రామాల అభివృద్దే ధ్యేయంగా పని చేస్తామని తెలిపారు. గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధిపరచడమే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పుష్పలతా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎం.డి. మసూద్, మాజీ మండల అధ్యక్షుడు సోమోరే నాగోరావు, పట్టణ అధ్యక్షుడు ఎం.డి.జహీర్, సేవాదళ్ మండల అధ్యక్షుడు చహకటి మాణిక్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పాటగూడ భూమిపూజ చేసి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

● 'పూలాజీ బాబా బాటలో నడవాలి'

ఇంద్రవెల్లి: పూలాజీ బాబా బాటలో నడవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండల కేంద్రంలో ఈనెల 13, 14న సద్గురు పూలాజీ బాబా ధ్యాన కేంద్రం 18వ వార్షికోత్సవం నిర్వహించనుండగా, అందుకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలను సన్మార్గంలో నడిపించేందుకు ఎందరో గురువులు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ అంధ్ సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖడే విష్ణు, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాకురే రాందాస్, జిల్లాప్రధాన కార్యదర్శి కరాడే మారుతి, డాక్టర్ జ్ఞానేశ్వర్, జవాదే వామన్, గజానంద్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: మండలకేంద్రంలోని లకిసియా బంజారా (ఎల్‌బీ) నగర్‌లో ఆదివారం ఖానాపూర్ ఎంఎల్‌ఏ వెడ్మ బొజ్జు పటేల్ రూ.10లక్షలతో మంజూరైన సిమెంట్ రోడ్డు పనులకు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్‌బీనగర్ ప్రజలు స్వయంగా హనుమాన్ మందిరం నిర్మించుకోవడం హర్షణీయం అన్నారు.ప్రజల కోరిక మేరకు ఎంపీ లాడ్స్ నుంచి 10 లక్షలు రోడ్డు నిర్మాణానికి మంజూరు చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఈఈ రాథోడ్‌భీమ్‌రావ్, అమృత్‌లాల్, పవార్‌సురేష్, జాదవ్‌జగదీశ్, కొడప రాధాబాయి, హర్షద్ తదితరులు పాల్గొన్నారు.

జీవో ప్రకారం వేతనాలు ఇవ్వడం లేదు

● ఏఐటీయూసీ అనుబంధ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చందు ● రిమ్స్ ఎదుట కార్మికుల సమ్మె

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 10: రిమ్స్‌లో పని చేసే కార్మికులకు కాంట్రాక్టర్ జీవో ప్రకారం వేతనాలు ఇవ్వడం లేదని రిమ్స్ ప్రధాన గేటు ఎదుట ఏఐటీయూసీ అనుబంధ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు డొంగ్రె చందు ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించారు. ఈ సమ్మె ఆదివారంతో రెండవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ మాట్లాడుతూ గత 15 రోజుగా ప్రతీరోజు గంటపాటు రిమ్స్ ఎమర్జెన్సీ ముందు కరోనా ఓపీ ముందు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన, ధర్నాలు చేసినా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కాంట్రాక్టర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. రిమ్స్ కాంట్రాక్ట్ ప్రతిపాదికన పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ గార్డు పేషేంట్ కేర్ సిబ్బందికి జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు.వేతనాల కోసం 15రోజులుగా నిరసనలు చేస్తున్న పట్టించుకోవడం లేదన్నారు. దానికారణంగా విధులు బహిష్కరించి సమ్మె చేపట్టామన్నారు. జీవో ప్రకారం రూ.15వేల 600 ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.11వేలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. ఈఎస్‌ఐ,పీఎఫ్ డబ్బులను దోచుకుంటున్నారని ఆరోపించారు. అలాగే డీఎంఈ సర్కులర్ ప్రకారం జీవోఎంఎస్ 60 ప్రకారం కాంట్రాక్టర్ తీసుకున్న అగ్రిమెంట్ ప్రకారం వేతనాలు, పీఎఫ్, ఈఎస్‌ఐ ఇచ్చేంత వరకు సమ్మె ఆగదని క్రిష్ణ కన్‌స్ట్రక్షన్ ఏజెన్సీ యజమానికి హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ ముజీఫ్, ఎండీ ఖాసీం, సంగీత, లస్మక్క, కమలమ్మ, గంగామని, రవి, రాజేందర్ సింగ్, శ్రీనివాస్, జక్కుల రాము, రుక్మిణి, ఇక్బాల్, వమాన్, సైఫ్‌ఖాన్, ఇమ్రాన్ ఖాన్, ప్రశాంత్, ఖదీర్, పులిసునిత, ఆలీం, లక్ష్మి, పద్మ, లక్ష్మి, నర్సమ్మ, జైసీల, మంగమ్మ, రాధా, తదితరులు పాల్గొన్నారు.



రిమ్స్ ప్రధాన గేటు ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు



రాష్ట్ర ఇన్‌చార్జీ తరుణ్‌చుగ్ సమక్షంలో పార్టీలో చేరుతున్న గోడం నగేష్

కమలం గూటికి మాజీ ఎంపీ గోడం నగేష్

● బీజేపీ ఎంపీ టికెట్ హమీతోనే చేరిక!!

ఇచ్చోడ, మార్చి 10: పార్లమెంట్ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ పార్టీకి పెద్ద షాక్ తగిలింది. ఆ పార్టీ ఆదిలాబాద్ జిల్లా మాజీ మంత్రి, మాజీ ఎంపీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గోడం నగేష్ కారు దిగి కమలం పార్టీలో చేరిపోయారు. గత కొంత కాలంగా గోడం నగేష్ బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరుతారన్న ఊహాగానాలకు ఎట్టకేలకు తెరపడింది. ఆదివారం ఆయన డిల్లీలో బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జీ తరుణ్‌చుగ్ సమక్షంలో బీజేపీ కండువాను కప్పుకున్నారు. అయితే, గోడం నగేష్ ఆదిలాబాద్ ఎంపీ టికెట్‌ను ఆశిస్తూ పార్టీలో చేరినట్టుగా బీజేపీ శ్రేణులు, గోడం అనుచరులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఈసారి కూడా ఎంపీ సీటును కైవసం చేసుకునేందుకు కమలం పార్టీ అధిష్ఠానం పావులు కదుపుతోంది. ఇటీవల దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఆదిలాబాద్‌లో ఎన్నికల శంఖారావం పూరించడం ఇందుకు బలాన్ని చేకూరుస్తోంది. గోడం నగేష్‌కు బీజేపీ ఎంపీ టిక్కెట్ ప్రకటించే అవకాశాలున్నట్లు.. ఆ హామీతోనే బీజేపీ కండువాను గోడం నగేష్ కప్పుకున్నట్లుగా బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. బీజేపీ పార్టీ టికెట్ నగేష్‌కు కేటాయిస్తే.. ప్రస్తుత ఎంపీ సోయం బాపురావు కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచే అవకాశం ఉన్నట్లుగా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి ఆదిలాబాద్ రాజకీయాలు వేడెక్కాయి.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

● 36ఏళ్ల తర్వాత కలుసుకున్న 1987-88 బ్యాచ్ విద్యార్థులు

తలమడుగు, మార్చి 10: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కి చెందిన 1987-1988 పదో తరగతి పూర్వ విద్యార్థులు 36ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అప్పటి పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు వారికి విద్య బోధన అందించిన అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకుని పైకి వచ్చినప్పుడే ఉపాధ్యాయులకు తృప్తిని లభిస్తుందన్నారు. ఇందులో మంది విద్యార్థులకు విద్యా బోధన అందించినప్పటికీ వారి ప్రయోజకులు అయినప్పుడే ఉపాధ్యాయులకు గురుదక్షిణ లభిస్తుందన్నారు. ఎక్కడా స్థిరపడినా.. తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను పాఠశాలను గ్రామాన్ని మరిచి పోవద్దన్నారు. అంతేకాకుండా తోటి విద్యార్థులకు కష్టసుఖాలు పాలుపంచుకుని ఐక్యతను చాటాలని సూచించారు. అనంతరం విద్యార్థులు వారి వారి జీవిత విషయాలను ఒకరికొకరు పాలు పంచుకున్నారు నాడు విద్యార్థులుగా పరిచయమై అందులో కొంతమంది తాతలుగా మారి వారి వారి శేష జీవితాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఇందులో ఉపాధ్యాయులు రచ్చరెడ్డి సంపత్ శ్రీనివాసచారి, లింగారెడ్డి, మాజీ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు రమేష్‌రాములు, సత్యనారాయణ, ప్రహ్లాద్, అశోక్, ప్రమోద్‌రెడ్డి, ప్రమోద్ తదితరులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు



ఇంద్రవెల్లిలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న దృశ్యం

'సావిత్రీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి'

ఇంద్రవెల్లి, మార్చి 10: చదువుల తల్లి సావిత్రీబాయి పూలేను ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని అంబేడ్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి వాగ్మార్ కామరాజ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మిలింద్ నగర్ కాలనీలోని త్రిరత్న బుద్ద విహార్‌లో మహామాయ ఉపాసిక సంఘ్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి వర్ధంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో మహామాయ ఉపాసిక సంఘ్ సభ్యులు వాగ్మార్ ఉషాబాయి, ఉజ్వల, మాయావతి, మధుమాల, ప్రభాబాయి, లతాబాయి, మీరాబాయి, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: సోనాల మండలకేంద్రంలో ఆదివారం పూలే వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో రమేష్ బత్తుల మాట్లాడుతూ చదువుల తల్లి సావిత్రీబాయి పూలే ఆడపిల్లల చదువు ఎంతగానో ప్రోత్సహించారన్నారు. ఆమె మహిళల్లో చైతన్యం తెచ్చేందుకు గాను కృషి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు గాజుల పోతన్న, ఉపాధ్యక్షుడు తుమ్మ శ్రీధర్, కార్యదర్శులు విజయభాస్కర్, కసిరి పోతన్న, బౌద్ద సొసైటీ అధ్యక్షుడు అమృతరావు పాటిల్, సంఘపాల్ జక్కుల రవి, వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపాలి'

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 10: రాష్ట్ర ప్రభుత్వం విద్యా, ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపాలని ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర ప్రభారి పాలేటి వెంకట్రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్‌లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

హరీష్‌రావు క్షమాపణ చెప్పాలి : పీఆర్టీయూ

ఉట్నూర్, మార్చి 10: ప్రభుత్వం ఉద్యోగులకు ప్రతీనెల ఒకటవ తారీఖున వేతనాలు ఇస్తూ తరగతి గదుల్లో, కార్యాలయ గదుల్లో కూర్చుండి పనిచేసే వారికి ప్రాధాన్యత ఇస్తూ రైతులను పట్టించుకోవడం లేదని మాజీ రాష్ట్రమంత్రి తన్నీరు హరీష్‌రావు చేసిన వ్యాఖ్యల పట్ల పీఆర్టీయూ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, ఉద్యోగ ఉపాధ్యాయులకు హరీష్ రావు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి జాదవ్ సంజయ్‌కుమార్, జిల్లా అసోసియేటెడ్ అధ్యక్షులు జాదవ్‌గోవింద్‌లు మాట్లాడారు. ఇందులో మండల ప్రధాన కార్యదర్శి పెందూరుబండు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సావర్గాం గ్రామస్థులు

నేరడిగొండ, మార్చి 10: బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను సావర్గాం గ్రామస్థులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన నివాసంలో శాలువాతో సన్మానించారు. గ్రామాభివృద్ధితో పాటు జగదాంబ సేవాలాల్ ఆలయం, హనుమాన్ ఆలయాల వద్ద షెడ్ నిర్మాణం, గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. సీసీ రోడ్డుకు రూ.5లక్షలు ఇస్తున్నట్లు ప్రకటించారు. దీంతో పాటు గ్రామాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎళ్లప్పుడు ఉంటాయని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన లంబాడీల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు జాదవ్‌మహేందర్, గ్రామస్థులు నారాయణస్వామి, ఇందల్‌నాయక్, ధరమ్‌సింగ్, కిషన్, రాజేశుడు, మోతీలాల్, శివలాల్ తదితరులు పాల్గొన్నారు.

'వేసవి దుక్కులతోనే అధిక లాభాలు'

తాంసి, మార్చి 10: వేసవిలో దుక్కలు దున్నడం వల్ల వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో రబీ పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు నిర్ధారించిన విత్తనాలను మాత్రమే వేసుకోవాలి మోతాదుకు మించి పురుగు మందులు వాడటం వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉండవు అన్న విషయాన్ని ప్రతి రైతు గమనించాలన్నారు. ముఖ్యంగా పంట మార్పిడి విధానంతో అధిక దిగుబడులు సాధ్యమవుతాయని అన్నారు. ముఖ్యంగా సమయానికి ఎరువులు, పురుగు మందులు వాడాలని కోరారు. వేసవి దుక్కులలో పశువుల ఎరువును వేసినట్లయితే అది పంటలకు మంచి ఫలితాన్ని అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా వానాకాలం సీజన్‌లో వేసే పంటల విధానం గురించి రైతులకు వివరించారు.

ట్రాక్టర్ బోల్తా : పలువురికి తీవ్ర గాయాలు

ఇంద్రవెల్లి, మార్చి 10: మండలంలోని పాటగూడ(కె) గ్రామ సమీపంలో ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఖండాల గ్రామానికి చెందిన పలువురికి గాయాలయ్యాయి. ప్రత్యేక సాక్షులు 108 అంబులెన్స్ సిబ్బంది ఆత్రం అశోక్, సాయినాథ్, వినోద్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. శివరాత్రి పూజల్లో భాగంగా ఆదిలాబాద్ రూరల్ ఖండాల గ్రామానికి చెందిన ఆదివాసీలు మహా భారత నాటక ప్రదర్శన కోసం శనివారం సిరికొండ మండలంలోని సుంకిడి గ్రామానికి వెళ్లారు. రాత్రి మహా భారత నాటక ప్రదర్శన చేసి ఆదివారం ట్రాక్టర్(ఏపీ 01టీఏ0752)లో తిరిగి ఖండాల గ్రామానికి వెళుతున్న సమయంలో ఇంద్రవెల్లి మండలంలోని పాటగూడ(కె) గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో కృష్ణ అనే వ్యక్తికి కాలు విరిగింది. కుమ్ర గుణ్వంత్‌రావు, పెందోర్ కార్తిక్, పెందోర్ శంక్రులకు తలపై, చేతులకు, కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో మిగతా 9మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి రెండు అంబులెన్స్‌ల ద్వారా ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. కృష్ణ అనే వ్యక్తి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు రిఫర్ చేసినట్లు 108 పైలెట్ ఆత్రం అశోక్, ఈఎంటీ సాయినాథ్, వినోద్, కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, శుభ కార్యక్రమానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదం జరగడంతో ఖండాల గ్రామస్థులు విచారం వ్యక్తం చేశారు.

'రోడ్డు సాధనకు త్వరలో కార్యాచరణ'

భీంపూర్, మార్చి 10: భీంపూర్ మండలం పిప్పల్‌కోటి నుంచి సరిహద్దు గ్రామాలైన కరంజి(టి) గుబ్డి వరకు రోడ్డు నిర్మాణం కోసం అలుపెరుగని పోరాటం చేస్తామని సాధన కమిటీ కన్వీనర్ ఎల్టి నరేష్‌రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు కరంజి(టి)లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 50 కిలోమీటర్ల తమ రోడ్డు పరిస్థితి మారటం లేదని ఆయన వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ రోడ్డు నిర్మాణం జరిగిందని, ఆ తర్వాత అధ్వాన్నస్థితికి మారగా ఎవరూ పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రోడ్డు మంజూరు అయ్యిందని.. త్వరలో పనులు ప్రారంభిస్తామని మాట ఇచ్చి తప్పారన్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నతాధికారులు ఈ రోడ్డు గుర్తించి రెండు రోజుల్లో చెప్పాలని, లేనిపక్షంలో 50 గ్రామాల ప్రజలను కలుపుకుని ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. త్వరలోనే మండలకేంద్రంలో సమావేశమై తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని వారు పేర్కొన్నారు. ఈ ఉద్యమం రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తామన్నారు. ఈ ఉద్యమం రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బక్కి సతీష్, బండి గజానన్, ప్రవీణ్, గడ్డం నాగారెడ్డి, అనిల్, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



వైభవంగా శివపార్వతుల కల్యాణం

కుభీర్ మార్చి 10: మండలంలోని పార్డి (బి) రాజరాజేశ్వర ఆలయంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి వరకూ సాగిన కల్యాణమహోత్సవానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలోని దేవతామూర్తులకు పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేకపూజలు నిర్వహించి గ్రామస్థులు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం శివపార్వతుల కల్యాణం భక్తిగేయాలు, భజనలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు రాజేశ్వర్, మోహన్, చంద్రకాంత్, సురేష్, బాబు, రాంచందర్, దత్తాత్రి తదితరులు పాల్గొన్నారు.

మార్పులు చేర్పులకు రంగం సిద్ధం!





- హస్తం గూటికి చేరనున్న కారు నేతలు
- రెండు, మూడు రోజుల్లో కీలక పరిణామాలు
- రాజధానికి తరలిన కాంగ్రెస్ శ్రేణులు
- మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిల నిర్ణయం కోసం ఎదురుచూపులు
- వారం రోజుల్లో జిల్లా రాజకీయాల్లో సమూల మార్పులు



నిర్మల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కొద్దిరోజుల నుంచి కొనసాగుతున్న రాజకీయ ఊహాగానాలకు ఎట్టకేలకు తుదిరూపం లభించబోతోంది. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డితోపాటు ఆ పార్టీకి చెందిన చాలా మంది సీనియర్ నాయకులు, కార్యకర్తలంతా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు దాదాపుగా రంగం సిద్ధమైంది. ముఖ్యంగా గత నాలుగైదు రోజుల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిక వ్యవహారం వేగంగా మలుపులు తిరుగుతోంది. కాంగ్రెస్ పార్టీలో చేరాలంటూ అల్లోల ఇంద్రకరణ్ రెడ్డితోపాటు విఠల్‌రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఒత్తిడి తీసుకువస్తుండడం అలాగే బీఆర్ఎస్ పార్టీపై భ్రమలు తొలగిపోతుండడం, ఆ పార్టీ అధిష్ఠానం వ్యవహరిస్తున్న తీరు పట్ల ఇంద్రకరణ్‌రెడ్డి, విఠల్‌రెడ్డిలే కాకుండా పార్టీ సీనియర్ నాయకులు, నాయకులు తీవ్రఅసంతృప్తితో రగిలిపోతున్నారు. వీరంతా బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌పార్టీలో చేరేందుకు మానసికంగా సిద్ధమయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ మార్పుల వ్యవహారం కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లాలో అలాంటి మార్పులు జరగవచ్చున్న ఊహాగానాలు మొదలయ్యాయి.

జిల్లాలో వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలు

జిల్లాలో వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలు ఆ ఉహాగానాలకు బలం చేకూర్చుతున్నాయి. మూడురోజుల క్రితం మాజీమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిపె ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరే వ్యవహారంపై పెద్దఎత్తున ఒత్తిడి తెచ్చిన సంగతి తెలిసిందే. వీరంతా ఇంద్రకరణ్‌రెడ్డి ఇంట్లో సమావేశమై తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. 'మీ నిర్ణయం ఎలా ఉన్నా మేము పార్టీ మారడం ఖాయం' అంటూ ఇంద్రకరణ్‌రెడ్డికి వీరంతా స్పష్టంచేశారు. అయితే ఇంద్రకరణ్‌రెడ్డి కూడా వీరి వాదనలను ఖండించకుండా వేచిచూద్దామన్న ధోరణితో మాట్లాడారు. కాగా హైదరాబాద్‌లో కూడా పార్టీ సీనియర్లు అలాగే కొంతమంది ఇంద్రకరణ్ రెడ్డి బంధువులు సైతం పార్టీ మార్పు విషయమై సీరియస్‌గా చర్చించినట్లు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలోనే శనివారం పరామర్శల పేరిట బోథస్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి నిర్మల్‌లోని ఇంద్రకరణ్‌రెడ్డి ఇంటికి వచ్చి మాట్లాడిన వ్యవహారం కొద్దిరోజుల నుంచి జరుగుతున్న చర్చకు బలం చేకూర్చిందని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం చాలామంది పార్టీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌కు వెళ్లడం రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. అయితే ఆదివారం సాయంత్రం వరకు మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పార్టీ మార్పు విషయంలో ఏదో ఓ నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయంటున్నారు. ఈ నేపథ్యంలోనే మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని పార్టీలో చేర్చుకోవద్దంటూ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు, సీఎం రేవంత్‌రెడ్డికి, పార్టీ ముఖ్యనాయకులకు స్థానిక కాంగ్రెస్‌పార్టీ నేతలు ఫిర్యాదులు చేస్తున్నారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కాంగ్రెస్‌పార్టీలో చేర్చుకోవద్దంటూ సారంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులంతా ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి తీర్మానించడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది.

రంగం సిద్ధం చేసుకుంటున్న మాజీలు

మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు దాదాపుగా రంగం సిద్ధమైందని అంటున్నారు. కొద్ది రోజులుగా కాంగ్రెస్ పార్టీలో చేరే అంశంపై ఇంద్రకరణ్‌రెడ్డి తీవ్రంగా రహస్య మంతనాలు సాగిస్తున్నారంటున్నారు. హైదరాబాద్‌లోని పార్టీ పెద్దలతో ఆయన ఇప్పటికే చర్చలు జరిపారని ప్రచారం జరుగుతోంది. దీంతోపాటు ముందస్తుగా ఇంద్రకరణ్ రెడ్డికి సన్నిహితుడైన విఠల్‌రెడ్డిని తెరపైకి తెచ్చి ఆయన పార్టీ మారబోతున్నారన్న ప్రచారాన్ని మొదలుపెట్టారంటుటన్నారు. దీనిపై ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తుందోనని ఆ స్పందన ఆధారంగా తానూ ముందుకు సాగాలని ఇంద్రకరణ్‌రెడ్డి నిర్ణయించినట్లు చెబుతున్నారు. దీంతో విఠల్‌రెడ్డి పార్టీ మారే విషయమై కొద్దిరోజులుగా వేగంగా పావులు కదుపుతుండడం, దీనిపై ప్రజల్లో సానుకూల స్పందన వస్తుండడంతో ఇక ఇంద్రకరణ్‌రెడ్డి తానూ సైతం అంటూ రంగంలోకి దిగారంటున్నారు. తన అంతరంగాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తల చేత చెప్పించే విధంగా ఆయన వ్యూహరచన చేశారంటున్నారు. దీనికి అనుగుణంగానే ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులంతా ఇంద్రకరణ్‌రెడ్డిపై వ్యూహాత్మకంగా ఒత్తిడి తెస్తుండడం, దానికి అనుగుణంగా ఆయన స్పందన కూడా ఉంటుండడంతో ఇక కార్యచరణ మొదలైందంటున్నారు. ఈ క్రమంలోనే తమకు బంధువైన బోథస్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ద్వారా ఒత్తిడి తీసుకువచ్చేలా ప్రయత్నాలు జరిగాయంటున్నారు.

ఇంద్రకరణ్‌రెడ్డి చేరికను వ్యతిరేకిస్తున్న శ్రేణులు

మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు పావులు కదుపుతుండడాన్ని ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. మొన్నటి ఎన్నికల్లో ఇంద్రకరణ్‌రెడ్డికి తామంతా వ్యతిరేకంగా పోరాడామని అలాగే అనేక ఒత్తిళ్లు, బెదిరింపులు, కేసులు ఎదుర్కొన్నామని, అలాంటిది ఆయనను తిరిగి పార్టీలో చేర్చుకోవడం సమంజసం కాదంటూ వీరంతా అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఆదివారం సారంగాపూర్ మండల కేంద్రంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై ఇంద్రకరణ్ రెడ్డిని పార్టీలో చేర్చుకోవద్దంటూ తీర్మాణం చేయడమే కాకుండా ఆ తీర్మాణాన్ని సీఎం రేవంత్ రెడ్డికి అలాగే పార్టీ పెద్దలకు పంపడం ప్రాధాన్యతను సంతరించుకుంటోందంటున్నారు. అలాగే సోమవారం నుంచి అన్ని మండల కేంద్రాల్లో కూడా ఇదే తరహా తీర్మాణాలు చేసేందుకు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిర్ణయించారని చెబుతున్నారు.

సంధానకర్తగా ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు..

ఇంద్రకరణ్‌రెడ్డి, విఠల్‌రెడ్డిలతోపాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే వ్యవహారంపై ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు సంధానకర్తగా వ్యవహరించారంటున్నారు. ఇప్పటికే ఆయన వీరి చేరిక విషయమై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించారని సీఎం సానుకూల సంకేతాలు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఇంద్రకరణ్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడైన రాష్ట్ర కేబినేట్‌లోని ఓ కీలక మంత్రి చేరిక కోసం సీఎంపై ఒత్తిడి తెస్తున్నారంటున్నారు. మొత్తానికి ఈ పరిణామాలన్నీ అటు బీఆర్ఎస్ పార్టీని షాక్‌కు గురి చేస్తుండగా ఇటు కాంగ్రెస్ పార్టీలో కలవరం సృష్టిస్తున్నాయంటున్నారు.



కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

రసవత్తరంగా కుస్తీ పోటీలు

కుంటాల, మార్చి10: కుంటాల మండలంలోని ఓలా శివాలయం ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన కుస్తీ పోటీల్లో మండలంతోపాటు మహారాష్ట్ర నుంచి సైతం మల్ల యోధులు పాల్గొన్నారు. ఈ కుస్తీపోటీలను తిలకించేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రతీ ఏడాది మహాశివరాత్రి మరుసటి రోజు నిర్వహించే కుస్తీపోటీలు ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం నిర్వహించిన కుస్తీ పోటీల్లో మహారాష్ట్ర నుంచి మల్లయోధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మల్లయోధుల మధ్య జరిగిన పోటీ రసవత్తరంగా సాగింది. ఈ సందర్భంగా కుస్తీపోటీల్లో గెలుపొందిన బిద్రెల్లికి చెందిన సాయినాథ్ మొదటి బహుమతి కైవసం చేసుకున్నాడు. ఆలయ కమిటీ, గ్రామ అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో ఆయనను సన్మానించి మొదటి బహుమతి రూ.5వేలు అందజేశారు. ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు అంబుగాం గ్రామానికి సుదర్శన్‌పటేల్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పూజ్యబంతే దివంకర్ థేరో

'బుద్ధుని మార్గం అనుసరణీయం'

తానూర్, మార్చి 10: బుద్ధుని మార్గంలో అనుసరణీయమని పూజ్యబంతే దివంకర్ థేరో అన్నారు. మండలంలోని బెంబర్‌లో గత 10 రోజులుగా శ్రామ్‌నేర్ శిబిర్ కొనసాగుతుండగా.. ఆదివారం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బుద్ధుని సందేశాలు ప్రపంచ సమానత్వానికి మార్గదర్శకాలని వాటిని అనుసరించిన ప్రతీ మానవుడు సమాజంలో అభివృద్ధి బాటపట్టి అవాంఛనీయ సంఘటనలకు దూరంగా ఉంటాడన్నారు. అనంతరం పంచశీల్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్రనాయకులు సంజయ్‌బోధి కస్తూరే, జిల్లా అధ్యక్షుడు రమేష్ బాబు, వాగ్మారే నాయకులు ప్రభాకర్ గడ్‌పాలే, నాయకులు ఉన్నారు.

సావిత్రిబాయి పూలే అందరికీ ఆదర్శం

నిర్మల్ కల్చరల్, మార్చి10: బడుగు, బలహీనవర్గాల ఆడపిల్లలకు విద్యాబోధన చేసి చదువు ఆవశ్యకత తెలియజేసిన సావిత్రిబాయి పూలే అందరికీ ఆదర్శమని మాస్ లైన్ రాష్ట్ర నాయకుడు కె. రాజన్న అన్నారు. నిర్మల్ పట్టణంలోని గాజులపేట అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ఐఎఫ్‌టీయూ, పీవోఎల్ ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. భారత దేశంలోనే మొట్టమొదటి ఉపాధ్యాయరాలు సావిత్రిబాయి పూలే అని అన్నారు. ఆమెను ఆదర్శంగా మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. చిన్న రాజు, రాజన్న, రమేష్, భూమన్న, సునీల్, వినోద్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పటివేత

నర్సాపూర్(జి), మార్చి10: మండలంలోని నందన్ ఎక్స్‌రోడ్డు వద్ద అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా ఇసుక ట్రాక్టర్ టీఎస్18-టీ2289ను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై ఎం.హన్మాండ్లు తెలిపారు. చర్యల కోసం తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించినట్లు తెలిపారు.



హుండీని లెక్కిస్తున్న దృశ్యం

మల్లన్న దేవుని హుండీ లెక్కింపు

ముథోల్, మార్చి10: మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో గల మల్లన్న దేవుని హుండీ లెక్కింపును ఆదివారం గ్రామపెద్దలు, ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో చేపట్టారు. నగదు రూ.6,46,740తోపాటు బియ్యం, బెల్లం, మిశ్రమ వెండి, మిశ్రమ బంగారం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు ఆశన్న, అశోక్, నాయకులు, గ్రామస్థులు దత్తాత్రి, రవీందర్‌రెడ్డి, విఠల్ యాదవ్, గురుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

సారంగాపూర్, మార్చి10: మండలంలోని మలక్ చించోలి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు బీజేపీ నాయకులు రామ్‌శంకర్‌రెడ్డి, రాజేందర్ రెడ్డి, విలాస్, గంగారెడ్డిలు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు పోతన్న, నారాయణ, సాహెబ్‌రావు, తదితరుఉన్నారు.

ఖానాపూర్‌లో పూర్వవిద్యార్థుల సన్మానం

ఖానాపూర్, మార్చి10: పట్టణంలోని స్థానిక విశ్రాంతి భవనంలో ఆదివారం 1993-94 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమ తోటి మిత్రుడు ఇటీవల ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్‌గా చిన్నం సత్యనారాయణ ఎన్నిక అవ్వడంతో చిన్నం సత్యనారాయణ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడారు. లక్ష్మణచాంద ప్రభుత్వ పాఠశాలలో తమతోపాటు పదోతరగతి చదవిన చిన్ననాటి మిత్రుడు సత్యనారాయణ మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికపై ఆనందం వ్యక్తంచేశారు.



మున్సిపల్ చైర్మన్ దంపతులను సన్మానిస్తున్న 1993-94 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల బృందం

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



భైంసాలో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ తదితరులు

తానూర్, మార్చి 10: మండల కేంద్రమైన తానూర్‌లోని రైతువేదికలో ఆదివారం ఎమ్మెల్యే పవార్ రాంరావుపాటిల్ చేతులమీదుగా కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీచేశారు. అనంతరం సింగన్‌గావ్ గ్రామంలో రూ.4లక్షలు, నంద్‌గావ్‌లో రూ.5లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతీగ్రామంలో కనీస అవసరాలను అభివృద్ధి చేసేలా కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లింగమూర్తి, ఇన్‌చార్జి ఎంపీడీవో మోహన్‌సింగ్, బీజేపీ మండల అధ్యక్షులు చిన్నారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పశువుల నాగనాథ్, బెల్‌తరోడా సర్పంచ్ గోప సాయినాథ్, బీజేపీ సీనియర్ నాయకులు శివాజీపటేల్, మాజీ సర్పంచ్‌లు శివకుమార్, చక్రధర్ పటేల్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

భైంసా: నియోజక వర్గ పరిధిలోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ ప్రాధాన్యతననుసారం ప్రగతికి బాటలు వేస్తానని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ వెల్లడించారు. ఆదివారం భైంసాలోని నరసింహనగర్ కాలనీ పరిధిలోని నర్సింహ కళ్యాణ మండపంలో పట్టణ, మండల పరిధిలోని లబ్ధిదారులకు నిర్వహించి కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో విద్య, వైద్య అభివృద్ధికి బాధ్యతాయుంగా కృషి చేస్తున్నామన్నారు. భైంసా ఏరియా ఆసుపత్రిలో ప్రైవేట్ ఆసుపత్రికి దీటుగా వైద్య సేవలు అందించేందుకు ప్రణాళికబద్దమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. సందర్భంగా భైంసా ఎంపీపీ అబ్దుల్ రజాక్, మండల ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి లబ్ధిదారులకు చెక్కులను అందచేశారు.

కుభీర్: కల్యాణలక్ష్మీ పథకం నిరుపేదలకు వరమని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావుపాటిల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రం తహసీల్దార్ కార్యాలయంలో అర్హులైన కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు 135 మంది లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఆయా గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వివరించారు. గ్రామాల్లో సమస్యలను దశల వారిగా పరిష్కారం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సోము, పీఏసీఎస్ చైర్మన్, మార్కెట్‌స్టేట్ డైరెక్టర్ గంగాచరణ్, నాయకులు సాప్లీ రమేష్, బోయిడి విఠల్, కొట్టే హన్మండ్లు, ఎంపీటీసీ దేవిదాస్, కోఆప్షన్ సభ్యుడు దత్తహరి, కందూర్ చిన్న సాయినాథ్, లింబాద్రి పాల్గొన్నారు.

డబ్బుల చెల్లింపు వివాదంతోనే హత్యోదంతం

- నిందితుని అరెస్టు, రిమాండ్
- విలేకరుల సమావేశంలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ వెల్లడి



మాట్లాడుతున్నఏఎస్పీ కాంతిలాల్ పాటిల్



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనం



కేసులో స్వాధీనం చేసుకున్న స్క్రూడ్రైవర్, ఇతర వస్తువులు

భైంసా, మార్చి 10: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో శనివారం చోటుచేసుకున్న హత్య ఘటన డబ్బుల చెల్లింపు విషయంలో ఏర్పడిన వివాదం మూలంగానే జరిగిందని ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ వెల్లడించారు. కేసులో నిందితుడైన అబ్దుల్ జుబేర్ (27)ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లుగా పేర్కొన్నారు. ఆదివారం పట్టణ పోలీసు స్టేషన్‌లో సీఐ రాజారెడ్డి, ఎస్ఐ షరీఫ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి ఘటన వివరాలు వెల్లడించారు. ఏఎస్పీ తెలిపిన కథనం ప్రకారం ఘటన వివరాలు పట్టణంలోని ఓవైసీనగర్‌కు చెందిన సయ్యద్ సోహేల్ (24), నయాబాది కాలనీకు చెందిన ఎలక్ట్రీషియన్ అబ్దుల్ జుబేర్ (27) మధ్య మిత్రత్వం ఉంది. వీరిద్దరు కొంత కాలంగా వివిధ వ్యాపారాలు చేపట్టారు. ఇందులో భాగంగానే పట్టణంలోని బోకర్ క్రాస్ రోడ్డు సమీపంలో వీరిరువురు నడుపుతున్న పాన్‌షాప్ నష్టాలు రావడంతో మరో వ్యక్తికి విక్రయించారు. సంబంధిత డబ్బుల చెల్లింపులు, పంపకాల విషయంలో ఇద్దరి మధ్య వివాదం ఏర్పడింది. శుక్రవారం ఇద్దరు డబ్బుల విషయంలో కోట్లాటకు దిగగా కుటుంబ సభ్యులతో పాటు ఇతరమిత్రులు జోక్యం చేసుకొని రాజీ కుదిర్చివివాదం సమసిపోయేలా చర్యలు చేపట్టారు. శనివారం రాత్రి స్థానిక మిలన్ హోటల్ వద్దనున్న సయ్యద్ సోహేల్‌ను కలిసిన అబ్దుల్ జుబేర్ ద్విచక్ర వాహనంపై ఓవైసీనగర్‌కు బయలుదేరారు. వీరిరువురు సాయికాటన్ ప్రాంతానికి చేరుకునే సమయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకొని ఘర్షణకు దిగారు.ఇందులో ఆగ్రహావేశాలతో ఎలక్ట్రీషియన్ అయిన అబ్దుల్ జుబేర్ తన వద్దనున్న స్క్రూడ్రైవర్‌తో సయ్యద్ సోహేల్‌పై దాడికి పాల్పడ్డారు. విచక్షణరహితంగా కడుపు భాగంలో పోడిచాడు. దీంతో సయ్యద్ సోహేల్‌కు తీవ్ర రక్తస్రావం జరిగి ఘటన స్థలిలో కుప్పకూలి అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఇద్దరు యువకులు ప్రాణపాయ స్థితిలోనున్న అయనను ఆటో ద్వారా స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి నిజామాబాద్ తరలిస్తుండగా మార్గమద్యంలో మృతి చెందాడు. హత్యోదంత ఘటన అనంతరం టౌన్ సీఐ రాజారెడ్డి తగు రీతిలో స్పందించి గాలింపు చర్యలు చేపట్టి నిందితుడు అబ్దుల్ జుబేర్‌ను అదుపులోకి తీసుకొని విచారించినట్లుగా పెర్కొన్నారు. ఘటనలో వినియోగించిన స్క్రూడ్రైవర్‌తో పాటు సెల్‌ఫోన్, ద్విచక్ర వాహానాన్ని స్వాధీనపరుచుకున్నట్లుగా వివరించారు.



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ కాంతిలాల్ పాటిల్

రంజాన్ ఉపవాస దీక్షలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి: ఏఎస్పీ

భైంసా, మార్చి 10: రంజాన్ ఉపవాస దీక్షలను ముస్లింలందరూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని భైంసా అడిషనల్ ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణ పోలీసుస్టేషన్‌లో ముస్లిం ప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రంజాన్ ఉపవాస దీక్షలకు సంబంధించి పోలీసు శాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లను చేపడుతామన్నారు. ప్రార్థన మందిర మార్గాల్లో నమాజ్ సమయాల్లో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా ఉండేందుకు గాను ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. అన్నివర్గాల వారు పర్వదినాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకుగాను ఒకరికొకరు సహకరించుకోవాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసుశాఖకు సహకరి ంచాలన్నారు. ఇదేక్రమంలో ఆలయాలు, ప్రార్థన మందిరాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ జాబీర్ అహ్మద్, టౌన్ సీఐ రాజా రెడ్డి, ముస్లిం సంస్థల ప్రతినిధులు, మసీదుల ఇమామ్‌లు, వివిధ రాజకీయపార్టీల మైనార్టీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.